www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
సోమవారం | 19 | మే | 2025 పేజీలు 6

## మున్నేరు, పాలేరు లింక్ కెనాల్‌కు నిధులు విడుదల



**-వృథా నీటిని గ్రావిటి ద్వారా పాలేరుకు మళ్లింపు**
**-ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి పొంగులేటి**

**ప్రజాపక్షం/ఖమ్మం :** మున్నేరు, పాలేరు గ్రావిటి లింక్ కెనాల్‌కు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. వృధాగా సముద్రంలోకి పోతున్న మున్నేటి వరద నీటిని పాలేరుకు మళ్లించడానికి నిర్మించే లింక్ కెనాల్‌కు రూ. 162.54 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం జీవో నెం.98ను విడుదల చేసిందని ఆయన తెలిపారు.

మిగతా 2లో..

# తలనాడిస్తున్న తోకలు..!

**-ఆర్ఎంపిలు చెప్పిందే చేస్తున్న వైద్యులు**
**-కాసుల వేటలో వైద్య ధర్మం మరిచిన కొందరు**
**-చేష్టలూడిగిన వైద్య ఆరోగ్యశాఖ**



గ్రామీణ ప్రాంతాల్లో ఆర్ఎంపిలు పిఎంపిల సేవలు అవసరమే కాదు అనేక సందర్భాల్లో ప్రశంసనీయం కూడా. విపత్కర పరిస్థితుల్లో ప్రాథమిక వైద్యం అందించి ప్రాణాలను కాపాడుతున్నారు. తమ వ్యాపార విస్తరణకు ఒకప్పుడు ఆర్ఎంపిలను ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు వాడుకుని కమిషన్ల దందాతో ఆర్ఎంపి వ్యవస్థను పక్కదారి పట్టించాయి. కొందరు ఆర్ఎంపిలు తమ అనుభవంతో ఎంతో మంది ప్రాణాలను కాపాడారు కానీ ఇప్పుడు కమిషన్ల దందాతో సూది మందు కూడా వేయటం రాని వారంతా ఆర్ఎంపిలుగా మారి ఆసుపత్రులనే శాసించే పరిస్థితి ఏర్పడింది. ఆపరేషన్‌కు, ల్యాబ్ టెస్టులకు కమిషన్లు లెక్కకట్టి ఇచ్చిన తర్వాత ఇప్పుడు ఆర్ఎంపిలు చెప్పినట్లే వైద్యులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోగికి ఏ వైద్యం చేయాలి, బిల్లు ఎంత వేయాలి, ఎంత రిబేటు ఇవ్వాలి, ఎన్ని రోజులు ఆసుపత్రిలో ఉంచుకోవాలి ఇలా మొత్తం ఆర్ఎంపిలు పిఎంపిలే నిర్ణయిస్తున్నారు. వైద్యులు చెప్పింది చేయాల్సిన వీరు వైద్యులనే శాసించే పరిస్థితి ఏర్పడింది. ఈ వ్యవస్థకు కొందరు వైద్యులు దూరంగా ఉన్నప్పటికీ వీరు లేకుండా ఆసుపత్రులు నడవవన్న భావన క్రమేపి బలపడి చివరకు దాసోహం అనే స్థాయికి దిగజారింది. ఈ తలనాడిస్తున్న తోకల సమస్యకు పరిష్కారమెప్పుడో. శృతిమించిన ఈ వ్యవహారంపై జోక్యం చేసుకోవాల్సిన వైద్య ఆరోగ్యశాఖ చేష్టలూడిగి ఏమి చేయలేక చూస్తుండిపోతుంది.

-ప్రజాపక్షం/ఖమ్మం

2లో

## నిబద్దత గల కమ్యూనిస్టు
# పోటు ప్రసాద్


**పోటు ప్రసాద్ స్మారక స్తూపావిష్కరణ**




**ప్రజాపక్షం/ ఖమ్మం :** తుదిశ్వాస వరకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎర్రజెండా నీడలో పోరాటం సాగించిన పోటు ప్రసాద్ నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు అని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. ఆదివారం బోనకల్ రోడ్డులోని ఆదిత్య థియేటర్ సమీపంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దివంగత కార్మిక నేత పోటు ప్రసాద్ స్మారక స్తూపాన్ని హేమంతరావు ఆవిష్కరించారు.

మిగతా 2లో..

# దంచికొట్టిన వాన




**-సుమారు 3 గంటలపాటు కురిసిన వర్షం**
**-రోడ్లన్నీ జలమయం**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి మండలంలో ఆదివారం వర్షం దంచి కొట్టింది. ఉదయం మబ్బులు కమ్మిన వాతావరణం కనిపించగా, మధ్యాహ్నం ఎండ తీవ్రత భారీగా పెరిగింది. సాయంత్రం మూడు గంటలకు ఒక్కసారిగా మబ్బులు కమ్ము కుని గాలి దుమారంతో పాటు ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. మండే వేసవిలో బుడగట్టు రావాల్సిన సమయంలో భారీ వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు అవాక్కవుతున్నారు. సుమారు మూడు గంటలపాటు దంచి కొట్టిన వర్షం పుడమి తల్లిని తడిపి, ముద్ద చేసింది. రోహిణి కార్తకు వారం రోజులు

మిగతా 2లో..

# తలనాడిస్తున్న తోకలు..!



**ప్రజాపక్షం/ఖమ్మం :** వైద్యం అతి పెద్ద వ్యాపారంగా మారింది. అందులో ఖమ్మం నగరం తెలంగాణలో హైదరాబాద్ తర్వాత వైద్య కేంద్రంగా ఖమ్మం భాసిల్లుతున్నది. ఉమ్మడి జిల్లాలైన నల్లగొండ, వరంగల్ ఖమ్మం జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి వైద్య సాయం కోసం ఖమ్మంకు వస్తున్నారు. ఖమ్మంలో ప్రైవేటు ఆసుపత్రుల మనుగడ ఆర్ఎంపిలపై ఆధారపడే స్థాయికి దిగజారడంతో ఆసుపత్రులపై ఆధారపడి బతకాల్సిన ఆర్ఎంపిలు, పిఎంపిలు ఇప్పుడు ఆసుపత్రుల మనుగడను శాసించే స్థాయికి చేరారు. తోకను ఆడించాల్సిన తల ప్రకృతి విరుద్ధంగా తోకే తలను ఆడిస్తున్నది. గ్రామీణ ప్రాంతాల నుంచి వ్యాధి గ్రస్తులను తమ తమ ఆసుపత్రులకు తెప్పించుకునేందుకు యాజమాన్యాలు కమిషన్‌ను ఎర వేస్తున్నాయి. ఆర్ఎంపిలకు కొన్ని ఆసుపత్రులు లక్షల్లో అడ్వాన్సులు చెల్లిస్తున్నారు. ఆసుపత్రుల్లో జరిగే వైద్యానికి సంబంధించి ఆపరేషన్లు, ల్యాబ్ బిల్స్ , ఇన్‌పేషంట్ బిల్స్ ఇలా ప్రతి దానిపై కమిషన్లు చెల్లిస్తూ వైద్యాన్ని వ్యాపారంగా మార్చారు. కొన్ని ఆసుపత్రులు ఆర్ఎంపిలు పిఎంపిల కమిషన్లకు దూరంగా ఉన్న మాట కూడా యథార్థం. కమిషన్లపై ఆధారపడిన ఆర్ఎంపిలు గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన రోగులకు ఎటువంటి వైద్య సాయం అందించాలి, ఎన్ని రోజులు ఆసుపత్రిలో ఉంచుకోవాలి, ఎంత బిల్లు వేయాలి, అందులో మీకెంత మాకెంత అనేది ఆర్ఎంపిలే నిర్ణయిస్తున్నారు. కొన్ని ఆసుపత్రులు కేసుల కోసం ఆర్ఎంపిలకు సకల సౌకర్యాలు కల్పిస్తున్నాయి. గిఫ్టులు సరే సరి. ఆసుపత్రులు ఆర్ఎంపిలకు, పిఎంపిలకు కమిషన్లు అందించే వ్యవహారం వ్యక్తిగతం లేదా ఆసుపత్రి యాజమాన్యానికి ఆర్ఎంపిలకు పరిమితం కాదు. ఆసుపత్రికి చెల్లించేదైనా ఆర్ఎంపిలకు ఇచ్చే కమిషనైనా అది పూర్తిగా వ్యాధిగ్రస్తులది. రోగులను పీల్చిపిప్పి చేసి తాము కొంత దోచుకుని మరి కొంత దోచిపెడుతూ అవసరం లేని వైద్యం అందిస్తున్న ఆసుపత్రులపై చర్చ జరగాల్సి ఉంది. అవసరం లేకున్నా ఆపరేషన్లు చేయడం, అనవసర వైద్య పరీక్షలు నిర్వహించడం ఖమ్మంలో కొన్ని ఆసుపత్రులకు పరిపాటిగా మారింది. శృతిమించిన వైద్య దోపిడీకి సంబంధించి వైద్య ఆరోగ్య శాఖ సూప్తావస్థలో ఉండి ఏమి చేయలేకపోతుంది. తమకు ఫిర్యాదు రాలేదు కదా అన్న భావన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారుల నుంచి వినవస్తుంది. ప్రజలను వైద్యం పేరుతో దోపిడీ చేసి తిలాపాపం తలాపిడికెడు అన్నట్లు పంచుకు తింటుంటే పర్యవేక్షించాల్సిన వైద్య ఆరోగ్య శాఖ మౌనం పలు అనుమానాలకు తావిస్తుంది. ఇప్పటికైనా ఖమ్మంలో వైద్య దోపిడీ, కమిషన్ల తంతుపై విచారణ జరపాల్సి ఉంది. కొందరు రోగులకు వేస్తున్న బిల్లులకు చేసిన వైద్యానికి సంబంధం లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఈ మొత్తం వ్యవహారంపై విచారణ జరపడంతో పాటు రోగులను పీల్చిపిప్పి చేస్తున్న కమిషన్ దందాకు చెక్ పెట్టాలని రోగులు, వారి బంధువులు కోరుతున్నారు.

# నిబద్ధత గల కమ్యూనిస్టు పోటు ప్రసాద్




(మొదటిపేజీ తరువాయి)

అంతకు ముందు స్థానిక జెడ్పి సెంటర్ నుంచి స్తూపం వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో హేమంతరావు మాట్లాడుతూ పోటు ప్రసాద్ విద్యార్థి దశ నుంచి లౌకిక వామపక్ష భావ జాలంతో పని చేశారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాట మార్గమే సరైన మార్గమని నమ్మి తుదిశ్వాస వరకు అదే పంథాలో పయనించారని హేమంతరావు తెలిపారు. విద్యార్థి నాయకునిగా, కార్మిక నేతగా, భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా రథసారథిగా విభిన్న రూపాల్లో ఆయన పనిచేశారన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న ప్రసాద్ తన చివరి కార్యక్రమాన్ని ఖమ్మం కార్పోరేషన్ 40వ డివిజన్‌లో నిర్వహించారని ఇక్కడి ప్రజలు ప్రసాద్‌ను నిరంతరం జ్ఞప్తికి తెచ్చుకునే క్రమంలో స్మారక స్తూపాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. ప్రజా పోరాటాలు నిర్వహించడమే ప్రసాద్‌కు మనమిచ్చే ఘన నివాళి అన్నారు. స్మారక స్తూపం వద్ద సిపిఐ పతాకాన్ని రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా, కార్యవర్గ సభ్యులు బిజి క్లెమెంట్, పోటు కళావతి, మహ్మద్ సలాం, మేకల శ్రీనివాసరావు, పోటు రాజాసాత్విక్, పగడాల మల్లేష్, స్థానిక నాయకులు యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ విద్యార్థుల

# ఫీజుల పెంపు ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలి




**-విద్యార్థులకు శాపంగా మారిన రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలు**
**-ప్రశ్నార్థకంగా మారనున్న ఇంజనీరింగ్ విద్యార్థుల భవిష్యత్తు : ఏఐఎస్ఎఫ్**

**ప్రజాపక్షం/ఖమ్మం టౌన్ :** ఇంజనీరింగ్ ఫీజుల పెంపు ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని గిరిప్రసాద్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షులు మదుపల్లి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ 2025 26 విద్యా సంవత్సరానికి గాను రాష్ట్ర ప్రభుత్వం పెంచనున్న ఫీజుల పెంపుతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారనుందని ఆయన అన్నారు. ఆడిట్ నివేదికల ఆధారంగా ఎఫ్ఆర్‌సి ఇంజనీరింగ్ ఫీజులను నిర్ణయిస్తుందని దీనిని ఆసారగా చేసుకున్న రాష్ట్రంలోని కొన్ని ప్రైవేటు కళాశాలలు తమ ఇష్టానుసారంగా కొత్త కోర్సులను ప్రవేశపెట్టి విచ్చలవిడిగా ఫీజులు దండుకునే పనిలో పడ్డాయన్నారు. విద్యను ప్రాథమిక హక్కుగా గుర్తించాల్సిన అవసరం ఉందన్న ఇంజనీరింగ్ విద్యను పూర్తిగా కార్పోరేటీకరణ, ప్రైవేటీకరణ, వ్యాపారీకరణ, కమర్షలైజేషన్ చేస్తూ ప్రతి యేటా 35 నుంచి 75 శాతం వరకు ఫీజులు పెంచుకుంటూ పోవడం వల్ల ఇంజనీరింగ్ విద్య పేద, మధ్య తరగతి విద్యార్థులకు అందని ద్రాక్షగా మారిందన్నారు. ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల్లో ఫీజుల నియంత్రణపై ప్రభుత్వం చట్టం చేయాలని ఆయన కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫీజు రీయంబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్‌లపై ఆధారపడినటువంటి కళాశాలలు అనేకం ఉన్నాయన్నారు. ఇంజనీరింగ్ ఫీజుల అక్రమ డోనేషన్లను నియంత్రించకుండా ప్రభుత్వం ఉన్నత విద్యా మండలి చోద్యం చూస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించిన ఆడిట్ తనిఖీల రిపోర్టును బహిర్గతం చేసి తప్పుడు నివేదికలు ఇచ్చిన కళాశాలలపై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తుందన్నారు. ఎలాంటి సౌకర్యాలు లేనటువంటి ఇంజనీరింగ్ కళాశాలలపై తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. లేని యెడల రాష్ట్ర వ్యాప్తంగా అధిక డోనేషన్లు తీసుకుంటున్న ఇంజనీరింగ్ కళాశాలలపై ఆందోళనలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి శివనాయక్, జిల్లా నాయకులు ప్రతాప్, రాకేష్, పవన్, నరేందర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మున్నేరు, పాలేరు

# లింక్ కెనాల్‌కు నిధులు విడుదల

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపిన పొంగులేటి మాట్లాడుతూ సముద్రంలో పోయే వరద నీటిని గ్రావిటి ద్వారా మళ్లించాలని ఈ రాష్ట్రాన్ని పదేళ్లు పాటు ఏలిన ప్రభుత్వానికి ఆలోచన రాలేదన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం వల్ల ఈ జిల్లాలో 2.54 లక్షల ఎకరాల స్థిరీకరణ జరుగుతుందన్నారు. ఒక పాలేరు నియోజక వర్గంలోనే 1.30 లక్షల ఎకరాల స్థిరీకరణ జరుగుతుందని పొంగులేటి తెలిపారు. సూర్యాపేట, మహబూబాబాద్, ఖమ్మంజిల్లాలకు త్రాగునీరు డోర్నకల్ నియోజక వర్గ పరిధిలోని పది చెరువులకు సాగు నీరు అందించే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ప్రతి యేటా వస్తున్న వరద నీరు వృథా కాకుండా వడిసిపట్టుకుని సాగు భూములకు అందించాలన్న లక్ష్యంతో గ్రావిటి కెనాల్‌ను నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు.

# దంచికొట్టిన వాన

(మొదటిపేజీ తరువాయి)

సమయం ఉండగా, అప్పుడే రోళ్ళు నిండుతుండడంతో ఒకపక్క ఆనందంగా ఉన్న, మరోపక్క రైతులకు లోలోపల భయం పెరుగుతుంది. సమయం గాని సమయంలో వర్షాలు కురుస్తుండటంతో మామిడి పంటకు భారీగా నష్టం వాటిల్లుతుంది. ఊరగాయలు పెట్టే సమయం కావడంతో చట్నీ ప్రియుల సైతం కాయలు ఎంచుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. ఆదివారం కురిసిన వర్షంతో పట్టణమంతా ఒక్కసారిగా చల్లబడి ప్రజలను ఒకంత ఉపశమనానికి కలిగించినా, నేటి నుండి వాతావరణం ఏ విధంగా ఉంటుందో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది.

# మాతృభాషను ముందు తరానికి అందించేందుకు యువత కృషి చేయాలి



**ప్రజాపక్షం/భద్రాచలం :** మాతృభాష,సంస్కృతి సంప్రదాయాలను ముందు తరానికి అందించడానికి నేటి యువత కృషి చేయాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. ఆదివారం ఐటిడిఏ సమావేశ మందిరంలో ప్రపంచ ప్రదర్శనశాల దినోత్సవం, కోయవీరగాథచక్రం ప్రదర్శన డాక్యుమెంటేషన్ ప్రారంభం సభకు ఆయన ముఖ్యాఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ ఆదివాసీ గూడేల్లో గిరిజనులపై జరుగుతున్న అన్యాయాలను మొక్కవోని ధైర్యంతో పెత్తందారులను ఎదురించి సమ్మక్క సారలమ్మలు, కాకతీయులను ఎదురించి వీరమరణం పొందిన ఆదివాసీల ఇలవేల్పు బాపనమ్మ చంద్రపాల వారసులు రుద్రమాదేవి పరిపాలన కాలంలో వాడిన ఆయుధం, వారి చరిత్రను వీరగాథలుగా మలిచి నేటితరం గిరిజనులకు తెలియపరచడం చాలా సంతోషంగా ఉందన్నారు. గిరిజన సంస్కృతి సంప్రదాయాలు, ఆచారవ్యవహారాలు ప్రాచుర్యంలోనికి రావడానికి మావంతు కృషి చేస్తామని, ప్రస్తుతం ఐటిడిఏ అధికారిగా బాధ్యతలు తీసుకుని పదినెలలు గడుస్తోందని, ముందుగా గిరిజన విద్యావైద్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. నేటి తరం యువతీ యువకులకు, పిల్లలకు భాషపట్ల అవగాహన లేకపోవడంతో వారిభాషపై వారికి మక్కువ కలిగేలా ప్రయత్నించినట్లు తెలిపారు. ఆదివాసీ కళలు, ఆచారవ్యవహారాలు అంతరించిపోకుండా ఖండాంతరాలకు తెలిసే విధంగా గిరిజన మ్యూజియంపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. పాతతరం గిరిజనుల జీవనశైలి, వ్యవసాయంలో వారు వాటిన పనిముట్లు, ఇండ్లు, ఇలవేల్పులు, పూజా విధానం నగలు, గృహోపకరాణాలు ఆదరణకు నోచుకోక పోవడంతో వాటిని సేకరించి మ్యూజియంలో పొందుపరిచామన్నారు. అనుకున్న దానికంటే మ్యూజియాన్ని సందర్శించే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోందని, గిరిజన ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు, సంస్కృతిని కాపాడేందుకు ఐటిడిఏ కట్టుబడి పనిచేస్తుందన్నారు. అనంతరం కోయ సంస్కృతి సంప్రదాయాల బుక్‌లెట్‌ను ఆవిష్కరించి కులపంతుళ్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గిరిజన కల్చర్ రీసెర్చ్ సెంట్రల్ యూనివర్సిటి ప్రొఫెసర్ తిరుమల్‌రావు, కుల పంతుళ్లు బండ్ల మునీశ్వరరావు, గొర్రె బాపనయ్య, బండ్ల చుక్కమ్మ, గొర్రె సత్యం, రాంబాబు ట్రైబల్ మ్యూజియం ఇంచార్జ్ వీరస్వామి, వివిధ గ్రామాల నుండి వచ్చిన గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులకు ఆశీర్వాదం



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డులో ఆదివారం జరిగిన గాజులు మహేష్, రాణి దంపతుల కుమారుల పంచకట్టు వేడుక కార్యక్రమంలో పాల్గొన్న వైరా టౌన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు వీరంశెట్టి సీతారాములు చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో దుగ్గిరాల జాకోబ్, దురిశెట్టి నర్సింహారావు, బుడిగి వెంకన్న, మోర్ల శ్రీకాంత్, నరేష్, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్చిన హామీలు అమలు చేయాల్సిందే..

## -ఉగ్రవాదం, మతోన్మాదం ఎప్పటికైనా ప్రమాదమే
## -సిపిఐ నేత బాగం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** కాంగ్రెస్ ఎన్నికలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంత రావు డిమాండ్ చేశారు. హామీల అమలు కోసం తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఎదురు చూస్తున్నారని ఇప్పటికే జాప్యం జరిగిందన్న భావన, అసంతృప్తి ప్రజల్లో పెరుగుతుందని ఆయన అన్నారు. ఆదివారం ఖమ్మం 40వ డివిజన్ మహాసభకు అధ్యక్ష వర్గంగా బానాల వీరబాబు, శివచరణ్ లు వ్యవహరించారు. మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన హేమంతరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం పదేళ్ల పాటు ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలం చెందిందని ప్రజలు మార్పు కోరుతూ కాంగ్రెస్ పార్టీకి అధికారం అప్పగించారన్నారు. అధికార మార్పిడి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారని ముఖ్యంగా నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్ల పెంపు కోసం ప్రజలు ప్రభుత్వం వైపు చూస్తున్నారన్నారు. భూ భారతిని కూడా ఎటువంటి లోపాలకు తావివ్వకుండా నిర్వహించాలన్నారు. ఉగ్రవాదం, మతోన్మాదం దేశానికి ఎప్పటికైనా ప్రమాదమేనని హేమంతరావు స్పష్టం చేశారు. ఉగ్రవాద నిర్మూలనకు సంబంధించి సిపిఐ పూర్తి మద్దతునిస్తుందని అదే సమయంలో మతోన్మాద చర్యలను సైతం తీవ్రంగా ఖండిస్తుందని ఆయన తెలిపారు. జమ్ము కశ్మీర్ ఘటన తర్వాత మోదీ ప్రభుత్వం యుద్ధానికి ఎందుకు తెర లేపిందో ఆ తర్వాత ఎందుకు యుద్ధం నుంచి విరమించుకున్నదో అర్థం కావడం లేదని కానీ బిజెపి మాత్రం యుద్ధానికి ఉగ్రవాద చర్యలకు మతం రంగు పూస్తుందని ఆయన తెలిపారు. గతంలో అలీన దేశంగా భారత్ ఒక ప్రత్యేకతను సంతరించుకున్నదని కానీ ఇప్పుడు ట్రంప్ చేతిలో మోడీ కీలుబొమ్మగా మారి భారత దేశ అస్థిత్వానికే ప్రమాదం తెచ్చిపెడుతున్నారని హేమంతరావు ఆరోపించారు. భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధానికి సంబంధించి చేసిన వ్యాఖ్యలపై కనీసం ఖండన ఇచ్చే స్థితిలో ఎన్డిఏ ప్రభుత్వం లేదని ఆయన తెలిపారు. భారత్ వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటున్న ట్రంప్ ముందు సాగిలపడటమంటే భారతదేశ ఆత్మభిమానాన్ని దెబ్బతీయడమేనన్నారు. సుదీర్ఘ పోరాట చరిత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ 100వ సంవత్సరంలోని అడుగిడిందని శత వసంత సంబురాలను వాడవాడలా నిర్వహించాలన్నారు. ఈ సభలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, నగర కార్యదర్శి ఎస్కె జాని మియా, కార్పొరేటర్ బిజి క్లెమెంట్ తదితరులు ప్రసంగించగా రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రాబాబు, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు మహ్మద్ సలాం, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, తోట రామాంజనేయులు, మేకల శ్రీనివాస్, పగడాల మల్లేష్, పట్టణ నాయకులు గాదె లక్ష్మినారాయణ, యానాలి సాంబశివరెడ్డి, నూనె శశిధర్, ఏనుగు గాంధీ, తాటి నిర్మల, వరదా నర్సింహారావు, యాకూబ్, మాలకొండయ్య, మాజీ కౌన్సిలర్ మేకల పుల్లయ్య, వల్లపు వీరన్న, ఆడెపు అశోక్, బానాల భారతమ్మ, బానాల రాములు, పాకాలపాటి నాగరాజు, మహేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# తెలుగుదేశం పార్టీ పూర్వ వైభవం కోసం కృషి చేయాలి



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** తెలంగాణ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ పూర్వ వైభవం సంతరించుకుంటుందని తెలుగుదేశం పార్టీ ఎదుగుదలకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పాలేరు నియోజకవర్గ పరిశీలకులు మల్లెంపాటి అప్పారావు, నియోజకవర్గ ఇన్‌చార్జి కొండబాల కరుణాకర్ అన్నారు. మండల పరిధిలోని పిండిప్రోలు గ్రామపంచాయతీ శివారు పాపాయిగూడెం గ్రామంలో తెలుగుదేశం పార్టీ సర్వసభ్య సమావేశం మండల కన్వీనర్ నామ ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిధులుగా వారు హాజరై మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా పార్టీ సూచనల మేరకు తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. పార్టీ బలోపేతానికి త్వరలోనే గ్రామ, మండల కమిటీలను ఎన్నుకోవటం జరుగుతుందని తెలిపారు. తిరుమలాయపాలెం మండలంలో తెలుగుదేశంపార్టీ పూర్వవైభవం తీసుకువచ్చేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని, గ్రామాల్లోని ప్రజల సమస్యలను ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లెంపాటి లహరిన్, కొలిశెట్టి భిక్షమయ్య, నరాటి బాలకృష్ణ, సాలయ్య, మల్లీడి రమేష్, వంగవీటి కృష్ణమూర్తి, మర్నీదు సైదులు, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్రంలో
# మరలా బిఆర్ఎస్‌ని, కెసిఆర్‌నే కోరుకుంటున్నారు..

## ఆంధ్రప్రదేశ్ వైఎస్ఆర్ సిపి నేత, మాజీ మంత్రి జోగి రమేష్



**ప్రజాపక్షం/పెనుబల్లి:** తెలంగాణ రాష్ట్రంలో మరలా బీఆర్ఎస్ పార్టీ, కెసిఆర్ ని కోరుకుంటున్నారని, ఆంధ్రప్రదేశ్‌లో మరలా జగన్ కావాలని ప్రజలు భావిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ వైయస్సార్సీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేష్ అన్నారు. ఆదివారం పెనుబల్లి మండల కేంద్రంలో ఒక ప్రైవేట్ కార్యక్రమానికి హాజరై చిరకాల మిత్రుడు కోటగిరి సుధాకర బాబు నివాసంలో జరిగిన విలేకర్ల సమావేశం లో ఏపీ మాజీ మంత్రి రాజకీయాలపై మాట్లాడే పరిస్థితి లేదంటూనే ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల గత ప్రభుత్వాల పని తీరు, నేటి ప్రభుత్వాల పని తీరు గురించి ఇరు రాష్ట్రాల ప్రజలు భేరేజు వేసుకుంటున్నారని అన్నారు. తెలుగు రాష్ట్రాలలో గత ప్రభుత్వాల పని తీరే బాగుందని అధిక శాతం ప్రజలు అనుకుంటున్నారని తెలిపారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలలో గత ప్రభుత్వాలను వదులుకున్నందుకు ప్రజలు బాధపడుతున్నారని అన్నారు. ఏపీ ప్రజలు జగన్ కావాలని అంటున్నారని జగన్ మూడు పూటలా కడుపునిండా అన్నం పెట్టారని, బిర్యాని పెడతానన్నందుకు కూటమికి మద్దతు ఇచ్చామని మూడు పూటల అన్నం పాయే... బిర్యానీ పోయే.. అని ప్రజలు భావిస్తున్నారని తెలిపారు. తెలంగాణలో కూడా ఇదే పరిస్థితి ఉందని తన దృష్టికి వచ్చిందని అన్నారు. తెలంగాణ ప్రజలు కెసిఆర్ ని ఓడించి తప్పు చేశామన్న భావనలో ఉన్నారని అన్నారు. తెలంగాణలో కేసీఆర్ ని, ఏపీలో జగన్ ని కోరుకుంటున్నారని ప్రజల భావనలు చెబుతున్నానని అన్నారు. ముఖ్యమంత్రి అంటే ప్రజలను భయపెట్టే విధంగా కాకుండా భరోసా కల్పించే విధంగా ఉండాలని ముఖ్యమంత్రి ప్రజలకు భరోసా రాష్ట్రాన్నిముందుకు తీసుకెళ్లాలని అన్నారు. ప్రస్తుతం ప్రజలు సమయం కోసం, ఎన్నికల కోసం మాత్రమే ఎదురుచూస్తున్నారని ఈ సందర్భంగా ఏపీ మాజీ మంత్రి జోగి రమేష్ వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో చింతా అనిల్ గౌడ్ వంగా గిరిజ పతి, వంగా దాము తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల తోలకాలు ప్రారంభం



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో ఖరీఫ్ సీజన్ త్వరలో ప్రారంభం కానున్నందున రైతులు సేంద్రియ ఎరువులు తోలకాలను ప్రారంభించారు. సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి, రసాయన ఎరువులు ఉపయోగం, తగ్గుదల, భూసారం పెరుగుదల, ఎక్కువ రోజులు నీటి నిల్వలు, అనేక రకాల ఉపయోగాలు ఉంటాయని వ్యవసాయ శాఖ అధికారులు తెలుపుతున్నారు. మండల పరిధిలోని చిన్న కోరుకొండి, మర్లపాడు, పెద్ద కోరుకొండి, వెంకటాపురం, లింగాల, చెన్నూరు, ముచ్చవరం, పేరువంచ, బత్తులపల్లి తదితర పల్లె గ్రామాలలో ఎరువుల తోల కాలను రైతులు ప్రారంభించి సాగుకు సిద్ధం చేసుకుంటున్నారు.

# ప్రపంచ శాంతి కోసం క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం కతోలిక చర్చిలలో ప్రపంచ శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మత గురువులు జోజి బాబు బోధిస్తూ ఒకరు నొకరు ప్రేమించుకోవాలని, పరస్పరం ఇరుదేశాల మధ్య ప్రేమ కలిగి ఉన్నచో దానిని బట్టి ఐక్యత ఉంటుందని మానవ సమాజంలో అందరూ ఐక్యంగా జీవిస్తూ ఉండాలని కోరారు. ఇరుదేశాల మధ్య ఈ మధ్యకాలంలో యుద్ధాలు జరుగుతున్నాయని, శాంతి సామరస్యంతో చర్చలు కొనసాగించుకొని ఐక్యంగా కొనసాగాలని పలు దేశాల పరిపాలకులను, అధ్యక్షులను కోరారు. పెద్ద కోరుకొండి, చిన్న కోరుకొండి, టి వెంకటాపురం, చెన్నూరు, ఎర్రబోయినపల్లి, కిష్టారం తదితర గ్రామాలలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమాలలో కన్యాస్త్రీలు, ఉపదేశకులు, సంఘ పెద్దలు, సంఘస్తులు, యువతీ యువకులు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ సత్తా చాటాలి



**ప్రజాపక్షం/ఇల్లెందు:** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ సత్తా చాటాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.సారయ్య పిలుపునిచ్చారు. పట్టణంలోని నెం2బస్తీలో ఆదివారం జరిగిన 4వ, 5వ వార్డుల శాఖా సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో ఓడినా..గెలిచినా...ప్రజాసమస్యలపై పోరాడేది కమ్యూనిస్టులేనని అన్నారు. సీపీఐ సభ్యులు నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూడాలని సూచించారు. ప్రజా ఉద్యమాలే ఊపిరిగా, ప్రజాపోరాటాలే ప్రాణంగా గత వందేళ్లుగా సీపీఐ ప్రయాణిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్లలో రాజకీయజోక్యం లేకుండా అర్హులందరికీ అందించాలని, ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో నెరవేర్చాలని కోరారు. అనంతరం 4,5వ వార్డులకు శాఖా కార్యదర్శిగా కొత్త రాజయ్య, సహాయ కార్యదర్శులుగా సారయ్య, పోలు వెంకటస్వామితోపాటు 23మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దేవరకొండ శంకర్, పట్టణ కార్యదర్శి బంధం నాగయ్య, బైరవనేని సదానందం, మన్నాన్, గట్టయ్య, సరిత, మమత, రాజయ్య పాల్గొన్నారు.

## బోనగిరి ఆంజనేయులు కుటుంబాన్ని పరామర్శించిన పొంగులేటి



ప్రజాపక్షం/కూసుమంచి : మండలం కేంద్రంలో ప్రముఖ వ్యాపారి, ఆర్యవైశ్య సంఘం నాయకులు బోనగిరి ఆంజనేయులు కుటుంబాన్ని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఆంజనేయులు సతీమణి వెంకట వీరమ్మ ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా వెంకట వీరమ్మ చిత్రపటానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పూలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆమె భర్తతో పాటు కుమారులు ఆర్యవైశ్య సంఘం నాయకులు రాజేంద్ర ప్రసాద్, ఆంధ్రజ్యోతి సీనియర్ జర్నలిస్టు లక్ష్మీ నర్సింహారావును ఓదార్చారు. మంత్రి వెంట పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సందీప్ ఆత్మహత్యాయత్నానికి కారకులెవరు..?



ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం : ఓ చోరీ కేసులో అగ్రకుల వ్యక్తిని కాపాడేందుకు దళిత కుల యువకుడ్ని బలి చేసే ప్రయత్నం జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. మండల పరిధిలోని ఎర్రగడ్డ గ్రామంలో నల్లమల్ల నీరజ్‌కుమార్ ఇంట్లో ఈ నెల 3వ తేదీన గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి బంగారు ఆభరణాలు చోరీ చేశారు. ఈ క్రమంలో బాధితులు పోలీసులు ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఈమేరకు అదే గ్రామానికి చెందిన కొందరు అనుమానితులైన వారిని అదుపులోకి తీసుకుని విచారించగా వారిలో దారమళ్ళ సందీప్ అనే వ్యక్తి చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. ఈ మేరకు తన వద్ద బంగారు దిద్దులు ఉన్నాయని వాటిని పోలీసులకు అప్పగించాడు. కాగా మరో ఆభరణమైన నక్లెస్ అదే గ్రామానికి చెందిన బెల్లం అభిలాష్‌కు ఇచ్చినట్లు సందీప్ తెలిపాడు. పోలీసులు అభిలాష్‌ను పిలిపించి విచారించగా తనకేం సంబంధం లేదని చెప్పడంతో గతకొన్ని రోజులుగా కేవలం పోలీసులు సందీప్‌ని విచారణ నిమిత్తం స్టేషన్‌కు పిలిపిస్తున్నారు. కేవలం నన్ను మాత్రమే విచారిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని అభిలాష్‌ని ఏమి అడగటంలేదని మనోవేదనకు గురై శనివారం సాయంత్రం తిరుమలాయపాలెంలోని ఓ ఫెర్టిలైజర్ షాపులో గడ్డి మందు కొని తిరుమలాయపాలెంలో నూతనంగా నిర్మించిన సహకార ఎరువుల గోడౌన్ వెనుకాల కూల్‌డ్రింక్‌లో మందు కలుపుకుని తాగినట్లు సందీప్ తండ్రి తిరుపయ్య తెలిపారు. చోరికి పాల్పడ్డ ఘటనలో ఇద్దరికి సంబంధం ఉన్నా కేవలం దళిత కుల యువకుడు సందీప్‌ని విచారించడమేంటని అసలు వస్తువైన నక్లెస్ ఉన్న అగ్రకుల వ్యక్తి అభిలాష్‌ని ప్రశ్నించకపోవడంతో రాజకీయ ఒత్తిళ్లకు కుల అహంకారానికి పోలీసులు తలొగ్గి ప్రవర్తిస్తున్నారని సందీప్ కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. పోలీసులు మాత్రం బెల్లం అభిలాష్ నా పేరు ఎందుకు పోలీసులకు చెప్పావని బెదిరిస్తే సందీప్ గడ్డి మందు తాగినట్లు కుటుంబసభ్యులు తెలుపుతున్నారు. గడ్డి మందు తాగి ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సందీప్ నిజనిజాలు పూర్తిగా చెప్పాల్సి ఉంది.

## గీతా పారాయణంలో గోల్డ్ మెడల్ అందుకున్న వైద్యురాలు



ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు మండల పరిధిలోని తాళ్లూరు వెంకటాపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తోటకూర శేషగిరిరావు కుమార్తె తోటకూర శిరీష భగవద్గీత పారాయణం పోటీలలో గోల్డ్ మెడల్ ను గణపతి సచ్చిదా నంద స్వామీజీ అందజేశారు. మైసూర్ లో శనివారం జరిగిన పోటీల్లో ప్రతిభ కనపరిచినందుకు గాను శిరీష గోల్డ్ మెడల్ అందుకున్నారు. మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ తోటకూర శేషగిరిరావు కుమార్తె ప్రభుత్వ వైద్యవృత్తిలో కొనసాగుతూ గీతా పారాయణం లో ప్రతిభ కనపరుస్తూ నిర్వహించిన పోటీల్లో పాల్గొని గెలుపొందడం పట్ల మండల ప్రముఖులు, ప్రజాప్రతినిధులు తోపాటు లలిత్ కుమార్,సాయి సాకేత్ లు గ్రామస్తులు హర్షిస్తూ అభినందించారు.

# జిఎం నియామకం ఎన్నడో...?

**-అటకెక్కిన సిఅండ్ఎండి హామీ**
**-సుమారు రూ. 4 కోట్లతో జిఎం కార్యాలయం నిర్మాణం**




ప్రజాపక్షం/సత్తుపల్లి: సత్తుపల్లిలో సింగరేణి జలగం వెంగళరావు ఓపెన్ కాస్ట్ ప్రారంభమై సుమారు 20 సంవత్సరాలు గడుస్తున్నా నేటికి జి.ఎం నియామకం లేకపోవటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. సత్తుపల్లి నుండి సుమారు 14 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధిస్తూ రికార్డులు క్రియేట్ చేస్తున్నా జి.ఎం కార్యాలయం, జి.ఎం నియామకం అందని ద్రాక్షలుగానే మిగులుతున్నాయి అని వాపోతున్నారు జే.వి.ఆర్ ఓసి, కిష్టారం ఓసి, జే.వి.ఆర్ సి.హెచ్.పి ఉద్యోగులు. సత్తుపల్లిలో 2005 సంవత్సరం నుండి సింగరేణి సంస్థ కార్యాకలాపాలు సాగిస్తూ, లక్షల మిలియన్ టన్నుల బొగ్గును వెలికితీస్తూ, కోట్లు గడిస్తుంది.కాని 2 మిలియన్ టన్నుల బొగ్గును అందిస్తున్న కొత్తగూడెంలో జి.ఎం ఉంటుండటంతో సత్తుపల్లి లో కార్మికులు, సిబ్బందికి తలనొప్పిగా మారిందంటున్నారు సింగరేణి కార్మికులు. సత్తుపల్లిలో పనిచేస్తున్న ఉద్యోగులు ప్రతి చిన్న పనికి కొత్తగూడెం జి.ఎం ఆఫీస్ కి వెళ్ళాల్సి రావటం తలనొప్పిగా మారిందని , ఇలా కష్టమని భావించిన ఉద్యోగులు సింగరేణి యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చి, స్థానికంగా సత్తుపల్లి లో జి.ఎం కార్యాలయం నిర్మించాలని కోరటంతో, ఉద్యోగుల ఒత్తిడి మేరకు 2022 అక్టోబర్16న సింగరేణి జి.ఎం కార్యాలయంకు శంకుస్థాపన చేశారు. సుమారు రూ.4 కోట్లతో జి.ఎం కార్యాలయం నిర్మాణం పూర్తి చేసినప్పటికి, కార్యాలయాన్ని ప్రారంభించకుండా కాలయాపన చేస్తున్నారని, కార్యాలయం నిర్మాణం పూర్తై నెలలు గడుస్తున్నా సింగరేణి యాజమాన్యం జి.ఎం కార్యాలయం ప్రారంభ విషయంలో మీనమేశాలు లెక్కిస్తుండటంపై ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్మిక సంఘాలు జి.ఎం కార్యాలయం ప్రారంభించాలని పలమార్లు వినతి పత్రాలు సమర్పించినప్పటికి కూడా యాజమాన్యం స్పందించకపోవడం విడ్డూరంగా ఉందని స్వయంగా సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం ఇటీవల సత్తుపల్లి పర్యటనలో భాగంగా సత్తుపల్లిలో జి.ఎం నియామకం చేపడతామని, జి.యం కార్యాలయం ప్రారంభిస్తామని ఇచ్చిన హామీ అటకెక్కిందని ఉద్యోగులు, కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు కోట్లతో నిర్మాణం పూర్తయిన జీ.ఎం కార్యాలయం, జి.ఎం నియామకం లేకపోవటంతో, వృధాగా మిగిలిపోయిందంటున్నారు కార్మికులు. 20 సంవత్సరాలు చరిత్ర కలిగిన సత్తుపల్లి సింగరేణి లో జి.ఎం నియామకం జరగకుండా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సింగరేణి అధికారులు , కార్మిక సంఘాల నాయకులు అడ్డుకుంటున్నారని సత్తుపల్లి లోని పలు సంఘాల నాయకులు బహిరంగంగానే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జి.ఎం నియామకం జరిగినట్లయితే స్థానికులకు ఉద్యోగ అవకాశాలు రావడంతో పాటు, పలు కాంట్రాక్టులు దక్కే అవకాశం ఉంటుందని, జి.ఎం నియామకం చేపట్టకపోవడంతో చోటా, మోట కాంట్రాక్టులు అన్నీ కొత్తగూడెం వాళ్లకు దక్కుతున్నాయని. సత్తుపల్లి లో జనరల్ మేనేజర్ నియామకం చేపడితే ఇలాంటి ఎన్నో సమస్యలు సాధ్యమైనంత త్వరగా పరిష్కారమవుతాయని కార్మికులు తెలుపుతున్నారు. సత్తుపల్లిలో సింగరేణి సంస్థ జి.ఎం కార్యాలయం ప్రారంభమైతే సింగరేణి ప్రభావిత భూనిర్వాసిత నిరుద్యోగ యువతీ , యువకులకు ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని కార్మిక సంఘాల నాయకులంటున్నారు. సింగరేణి సంస్థ నిర్దేశించినటువంటి బొగ్గు ఉత్పత్తి లక్ష్యంలో సుమారు 15 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగి రవాణా జరుగుతుండటంతో స్వయంగా సి అండ్ ఎండి బలరాం ఉద్యోగులను అభినందించి త్వరలోనే జి.ఎం నియామకం చేపడతామని హామీ ఇచ్చిన పట్టించుకోని స్థానిక అధికారులు. బొగ్గు ఉత్పత్తి లో సత్తుపల్లిని ముందు వరుసలో నిలబెట్టిన ఉద్యోగుల గురించి సింగరేణి యాజమాన్యం పట్టించుకోవట్లేదని, ఉద్యోగుల శ్రమ వల్ల సంస్థకు కోట్లాది రూపాయలు లాభం వస్తున్నా, సింగరేణి సంస్థ మాత్రం ఉద్యోగుల సంక్షేమం కోసం కృషి చేయడం లేదని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి సింగరేణి సంస్థకు ఉత్పత్తి , రవాణాలో తలమానికంగా ఉన్న సత్తుపల్లిని ఏరియాగా గుర్తించి జి.ఎం కార్యాలయం త్వరగా ప్రారంభించి ఉద్యోగుల సంక్షేమం కోసం సింగరేణి యాజమాన్యం కృషి చేయాలని కార్మిక సంఘాలు , కార్మికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మెగా హెల్త్ క్యాంప్ విజయవంతం





ప్రజాపక్షం/జూలూరుపాడు: మండల కేంద్రమైన జూలూరుపాడులో సాయి ఎక్సలెంట్ స్కూల్ ఆధ్వర్యంలో ఖమ్మం సురక్ష హాస్పిటల్ వారు మెగా హెల్త్ క్యాంప్ ద్వారా 450 మంది పేద కుటుంబాల అనారోగ్యలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్తో డాక్టర్ తక్కలపల్లి వరుణ్ కన్సల్టెంట్స్ ఫిజీషియన్ డాక్టర్ రుద్ర గౌతమ్ రమేష్ మాట్లాడుతూ ఆరోగ్యం వంతులుగా జీవించాలని అనే లక్ష్యంతో ఖమ్మం సురక్ష హాస్పిటల్ ఆధ్వర్యంలో గ్రామీణ పేద అనారోగ్యాలకు వైద్య సేవలు అందించే లక్ష్యంగా తమ కృషి నిరంతరం కొనసాగుతుందన్నారు. ఆరోగ్య సేవలను ప్రజలు అందుకొని ఆరోగ్యవంతులుగా జీవించాలని పేర్కొన్నారు. ఈ హెల్త్ క్యాంప్‌లో ఎమ్మెస్ డాక్టర్ అనిల్‌కుమార్, ఈఎన్‌టీ డాక్టర్ ఎల్ అప్పిరెడ్డి డాక్టర్ భరత్‌కుమార్, సాయి ఎక్సలెంట్ స్కూల్ కరస్పాండెంట్ అరెబోయిన హుస్సేన్, సాయి ఎక్సలెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ కెపి, ఆర్ఎంపి ప్రవల్లిక, సీహెచ్ గోపికృష్ణ, సాయి ఎక్సలెంట్ స్కూల్ డైరెక్టర్ శివకుమారి, ఉపాధ్యాయులు నబీన, నవ్య, ప్రశాంతి, నాగరాజు, సత్యవతి, శాంతమ్మ, పావని, ఏ సరిత, కళ్యాణి, మాజీ జెడ్‌పిటిసి సభ్యులు దొండపాటి రమేష్, సిపిఐ మండల కార్యదర్శి గుండె పిన్ని వెంకటేశ్వర్లు, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు ఎస్‌కె చాంద్ పాషా, జిల్లా రైతు సంఘం నాయకులు ఎల్లంకి మధు, సురక్ష హాస్పిటల్ మేనేజర్ సైదులు, పిఆర్‌ఓ సునీల్, సిబ్బంది ఉమా, రేష్మ, మాధురి, తేజ, సందీప్, ప్రేమ్ పాల్గొన్నారు.

## మామిళ్ళపల్లికి నివాళులర్పించిన సండ్ర



ప్రజాపక్షం/సత్తుపల్లి: మండల పరిధిలోని కిష్టారం గ్రామానికి చెందిన సొసైటీ చైర్మన్ మామిళ్ళపల్లి కృష్ణయ్య శనివారం పరమదించగా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆదివారం వారి నివాసానికి చేరుకుని కృష్ణయ్య పార్థివదేహాన్ని సందర్శించి, పుష్పాంజలి ఘన నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతి తెలియజేశారు. సండ్ర వెంట మండల టిఆర్ఎస్ నాయకులు దొడ్డా శంకరరావు, పర్వతనేని వేణు, మాచినేని నరేంద్ర, జవ్వాజి అప్పారావు, నరుకుళ్ళ రాధాకృష్ణ, కూసంపూడి మధు, కొల్లపనేని ధనుంజయ్, కోడిమల అప్పారావు, మోరంపూడి కృష్ణ, మోరంపూడి శ్రీధర్, చింతనిప్పు సత్యనారాయణ, కొల్లపనేని అశోక్, పాలకుర్తి రాజు తదితరులున్నారు.

# వర్షాలతో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలి

**-రోజుకు 2.2 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, 2.4 లక్షల టన్నుల బొగ్గు రవాణా జరపాలి**
**-సమీక్ష సమావేశంలో ఛైర్మన్ ఎండీ ఎన్.బలరామ్**



ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ : వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో సింగరేణి సంస్థలో బొగ్గు ఉత్పత్తి, బొగ్గు రవాణా కుంటుపడకుండా తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని బలరామ్ అన్ని ఏరియాలోని జనరల్ మేనేజర్లను కోరారు. ఆదివారం ఆయన కొత్తగూడెం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లు, డైరెక్టర్ల తో ఉత్పత్తి పై ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారీ వర్షాల వల్ల ఓపెన్ కాస్ట్ క్వారీలలో నీరు నిలిచి బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడే అవకాశం ఉన్నందువల్ల ముందస్తుగా సంపులలోని నీటిని తొలగించడం కోసం తగినన్ని మోటారు పంపులను సమకూర్చుకొని సంసిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. గనులవారీగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. రోజుకు కనీసం 2.2 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, 2.4 లక్ష ల టన్నుల బొగ్గు రవాణా సాధించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంస్థ డైరెక్టర్ ఈ అండ్ ఎం. డి.సత్యనారాయణ రావు, డైరెక్టర్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ పా కె.వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ ఎస్‌డి. ఎం.సుభాని, డైరెక్టర్ సిపిపి మనోహర్, జి.ఎం మార్కెటింగ్ ఎన్.వి రాజశేఖర్ రావు లతో పాటు అన్ని ఏరియాలోని జనరల్ మేనేజర్లు, వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## జూనియర్ ఆఫీసర్ అకౌంట్స్ అంతర్గత అభ్యర్థులకు రాత పరీక్ష



ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ : సింగరేణి కాలరీస్ కంపెనీలో ఖాళీగా ఉన్న మైనింగ్ గ్రాడ్యుయేట్ ట్రైనీ ఈ 2గ్రేడ్ మరియు జూనియర్ ఆఫీసర్ అకౌంట్స్ ఈ1గ్రేడ్ పోస్టులను అంతర్గత అభ్యర్థులతో భర్తీ చేయుటకు ఆదివారము రోజున సింగరేణి మహిళా డిగ్రీ పీజి కళాశాలలో వ్రాత పరీక్ష నిర్వహించటం జరిగింది. మైనింగ్ గ్రాడ్యుయేట్ ట్రైనీ ఈ2గ్రేడ్ c35 ఖాళీ లకు గాను అర్హులయిన 115 మంది అభ్యర్థులకు హాల్ టికెట్లు జారీ చేయగా, 102 మంది అభ్యర్థులు హాజరయ్యారు. జూనియర్ ఆఫీసర్ అకౌంట్స్ ఈ1గ్రేడ్ c2e ఖాళీలకు గాను అర్హులయిన 2 మంది అభ్యర్థులకు హాల్ టికెట్లు జారీ చేయగా, 2 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ వ్రాత పరీక్ష సెక్యూరిటీ, విజిలెన్స్ సిబ్బంది పర్యవేక్షణలో, సిసి కెమెరాల నిఘా మధ్య నిర్వహించారు. సింగరేణి మహిళా డిగ్రీ పీజి కళాశాలలో జరిగిన ఈ పరీక్షను జిఎం ఈఎం విజిలెన్స్ కే.ప్రసాద రావు జిఎం పర్సనల్ ఆర్‌సి బెర్నడెట్ నికోలస్ పర్యవేక్షించి, పరీక్ష పూర్తిగా మెరిట్ పై ఆధారపడి ఉంటుందని, దళారులకు ఎలాంటి ప్రమేయం ఉండదని, వారిని నమ్మి ఎవరూ మోసపోవద్దని సూచించారు. ఈ పరీక్ష ఫలితాలు ఆదివారం రాత్రి నుంచే సింగరేణి వెబ్ సైట్ సింగరేణి ప్రధాన కార్యాలయ ముఖద్వారం వద్ద నోటీస్ బోర్డుద్వారా తెలియజేయటం జరుగుతుంది అని తెలియజేశారు. ఈ పరీక్ష నిర్వహణ జిఎం ఈఎంవిజిలెన్స్ కే.ప్రసాద రావు, జిఎం పర్సనల్ ఆర్‌సి బెర్నడెట్ నికోలస్, డిజిఎం పర్సనల్ పి.వేణు గోపాల రావు, పర్సనల్ మేనేజర్ కే.ప్రకాశ రావు, డివై.పిఎం డి.నాగేశ్వర రావు, విజిలెన్స్ ఆఫీసర్లు సిహెచ్.రామ బ్రహ్మం, జి.రాంచందర్, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ జాకీర్ హుస్సేన్, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీమతి డాక్టర్ చింతా శారద, ఇతర అధికారులు, సెక్యూరిటీ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

# పేదలకు ఇళ్ల స్థలాలు దక్కేవరకు పోరాటం

**సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు**





ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ : పేదలకు ఇళ్లు ఇళ్ల స్థలాలు దక్కేవరకు పోరాటం కొనసాగిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. కొమరం భీం కాలనీలో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని స్థానిక కొమరం భీం కాలనీ నుండి చుంచుపల్లి ఎమ్మార్వో ఆఫీస్ వరకు ప్రదర్శన నిర్వహించి అనంతరం ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, కొమరం భీం కాలనీలో గత ఏడు సంవత్సరాల నుండి ఇల్లు లేని పేదలు గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారని ప్రభుత్వాలు మారుతున్న వీరికి ఇళ్ల స్థలాలు మాత్రం ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు. ఎండా వాన చలిలో ఎన్ని ఇబ్బందులు వచ్చినా అక్కడే నివాసం ఉంటున్నారని అన్నారు. ఎన్నికలకు ముందు పేదలందరికీ ఇల్లు ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామని హామీ ఇస్తూ గెలిచిన తర్వాత ఒడ దాటాక బోడ మల్లయ్య అన్న చందంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం తీసుకొచ్చిన ఇందిరమ్మ ఇళ్ల పథకం కొమరం భీం కాలనీ పేదలకు వర్తించదా? వారు పేదవారు కాదా అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదలకు ఇళ్ల స్థలాలు దక్కేవరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఇళ్ల స్థలాలు దక్కేవరకు పేదలు ఐక్యంగా ఉద్యమించాలని, పేదల పోరాటానికి ఎర్రజండా ఎప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ కళావతికి ప్రజల వ్యక్తిగత దరఖాస్తులు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కి బాలరాజు, రేపాకుల శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్, నాయకులు డి.వీరన్న, బాలకృష్ణ, రాములు, రఘు, రమ, సంధ్య, నాగదుర్గ, రుహీనా, రసూల్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి ఫార్మర్ ఐడి రిజిస్ట్రేషన్

ప్రజాపక్షం/ములకలపల్లి: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్ నేటి నుండి ప్రారంభం అవుతుందని వ్యవసాయ విస్తరణ అధికారి బి రమేష్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ నేడు ఉదయం 10:30నిముషాలకు నుండి జగన్నాధపురం రైతువేదిక నందు ఆన్లైన్ చేయడం జరుగుతుందన్నారు. ప్రతి రెవిన్యూ పట్టా ఉన్న రైతుకు డిజిటల్ గుర్తింపు కార్డు జారీ చేయడం జరుగుతుందన్నారు. ఈ ఐడీలో 11 నెంబర్ ఉండి రైతు పేరు, ఆధార్, ఫోన్ నెంబర్, పాస్ బుక్ వివరాలు, భూమి రకం, సర్వే నెంబర్, సాగు చేసిన పంట వివరాలు ఉంటాయన్నారు. కేంద్ర ప్రభుత్వం పథకాలైన పీఎం కిసాన్, ఫసల్ బీమా, సాయిల్ హెల్త్ కార్డ్‌కు ఈ కార్డ్ తప్పని సరి అన్నారు. లేకపోతే ఆయా పథకాలు అందవని, కావున పోడు పట్టా ఉన్న వారు కాకుండా రెవెన్యూ పట్టా భూమి ఉన్న రైతులు అందరూ ఈ ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

## రేపటి నిరసన ప్రదర్శనను జయప్రదం చేయండి



ప్రజాపక్షం/ఇల్లెందు: కేంద్రప్రభుత్వం తీసుకొచ్చే కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని కార్మికసంఘాల పిలుపు మేరకు ఈనెల20న ఇల్లెందులో జరిగే నిరసన ప్రదర్శనను జయప్రదం చేయాలని కార్మికసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఆదివారం ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు కొప్పుల శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటైన కార్మిక సంఘాల నాయకుల సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కొక్కు సారంగపాణి, సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి ఎస్.ఎ.నబీ, ఐఎన్‌టీయూసీ జిల్లా నాయకులు బి.వెంకటనారాయణ, టీయూసీఐ ఇల్లెందు ఏరియా కమిటీ కార్యదర్శి మల్లెల వెంకటేశ్వర్లు, టీబీజీకెఎస్ ఇల్లెందు ఏరియా ఉపాధ్యక్షుడు జాఫర్ హుస్సేన్ మాట్లాడారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను, అమ్మకాలను ఆపాలని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, స్కీం వర్కర్లను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం నెలకు రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ, బీఆర్‌టీయూ జిల్లా నాయకులు తాళ్లూరి కృష్ణ, ఉపేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## మండల అధ్యక్షులు, బ్లాక్ అధ్యక్షుల ఎన్నిక

ప్రజాపక్షం/దమ్మపేట: అశ్వారావుపేట నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ ఐదు మండలాల అధ్యక్షుల, బ్లాక్ అధ్యక్షుల ఎన్నిక సమావేశం ఈ నెల 21వ తేది బుధవారం ఉదయం 10 గంటలకు, మండల పరిధిలోని పట్వారిగూడెం చెలికాని ఆదెమ్మ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు అశ్వారావుపేట నియోజకవర్గ క్యాంప్ కార్యాలయ ఇంచార్జ్ వట్టి వెంకట్రావు ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిధిలుగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా అధ్యక్షులు పొదేం వీరయ్య, జిల్లా అబ్జర్వర్లు టిపిసీసీ ఉపాధ్యక్షులు డాక్టర్ శ్రవణ్ కుమార్ రెడ్డి, టిపిసీసీ ప్రధాన కార్యదర్శి పి. ప్రమోద్ కుమార్, నియోజకవర్గ నాయకుల, మండల నాయకుల కార్యకర్తల సమక్షంలో నియోజకవర్గం లోని 5 మండలాల అధ్యక్ష, బ్లాక్ అధ్యక్షుల అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించబడునట్లు ఆయన తెలిపారు.

## రోడ్డు మరమ్మతులు చేయండి

ప్రజాపక్షం/భద్రాచలం : పదిపదిహేను ఏళ్ల క్రితం వేసిన మట్టి రోడ్డు తీవ్ర ఇబ్బందికరంగా మారిందని, వెంటనే రోడ్డు మరమ్మత్తులు చేసి ప్రజల అసౌకర్యాన్ని తొలగించాలని కోరుతూ సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో ఆదివారం దుమ్ముగూడెం మండలంలో ఆర్లగూడెం రహదారిపై ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా డివిజన్ నాయకులు సాయన్న మాట్లాడుతూ డి కొత్తగూడెం నుండి ఆర్లగూడెం వరకు గల మెటల్ రోడ్ పూర్తిగా ధ్వంసమైందని, నడిచేందుకు, రైతులు పొలాలకు వెళ్లేందుకు, ఇతర ప్రాంతాల ప్రయాణానికి కష్టంగా మారిందన్నారు. జిల్లా కలెక్టర్, ఐటిడిఏ పిఓ స్పందించి వెంటనే సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కొర్సా రామిశెట్టి, రామలక్ష్మి , పూసం ముత్తయ్య, సమ్మక్క, రాజేష్, నాగేశ్వరరావు,ధర్మయ్య, రాంబాబు, భద్రయ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మాలల హక్కుల పోరాడుదాం

ప్రజాపక్షం/వైరా: మాలల హక్కుల కోసం పోరాడదామని యూనిటీ ఆఫ్ మాల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో యూనిటీ ఆఫ్ మాల పట్టణ అధ్యక్షుడు అప్పం సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూన్8న ప్రతి మండలంలో పట్టణ ప్రాంతాల్లో విధిగా కార్యవర్గాన్ని ఏర్పాటు చేయాలని, తద్వారా మాలల హక్కుల కోసం పోరాటం చేయాలని కోరారు. రిజర్వేషన్ల కోసం పోరాటాన్ని కఠినతరం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మద్దెల రవి, ఫణితి సైదులు, నాగబత్తిని రమేష్, తుమ్మల చిన్ని, గారపాటి అశోక్, రాజు, రాయపూడిఉ, ముక్త మాలకృష్ణ, గుత్తి కొండ వీరబాబు, కందుల అర్జున్‌రావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతి దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలి

## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** భూ భారతిలో వచ్చిన దరఖాస్తుల పై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను అదేశించారు. మండలం లోని అమ్మగూడెంలో ఆదివారం పర్యటించిన సందర్భంగా స్థానిక తహశీల్దార్ వెంకటేశ్వర్లు ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మొత్తం ఎన్ని దరఖాస్తులు అందాయి... వాటిలో ఎన్ని పరిష్కరించారు. అవి ఏ స్థాయిలో ఉన్నాయి. ఎన్ని బృందాలు పర్యవేక్షణ చేస్తున్నాయి. అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల క్షేత్ర స్థాయి పరిశీలన ను శర వేగంగా చేపట్టాలని ఆదేశించారు. వాటి పరిష్కారంలో నిర్లక్ష్యం చేయవద్దని ఆదేశించారు. వివిధ సమస్యల పై గ్రామస్తులు మంత్రికి వినతి పత్రాలు అందించారు. అనంతరం గ్రామంలో నూతన వదువరులను ఆశ్వీరదించారు. ఈ కార్యకమంలో మార్కెట్ కమిటిచైర్మన్ వెన్నపూసల సీతారాములు, శాఖమూరి రమేష్, కొడాలి గోవిందరావు, భద్రయ్య, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, అడపాల రామారావు, గండు జానయ్య, కడియాల నరేష్ పాల్గొన్నారు.

# దేశ భవిష్యత్ మార్చడానికి యువత రాజకీయాల్లోకి రావాలి

## సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల

**ప్రజాపక్షం/చింతకాని :** దేశ భవిష్యత్తును మార్చడానికి యువత రాజకీయాల్లోకి రావాలని సీపీఐ రాష్ట్రసమితి సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం రాత్రి నేరడ గ్రామంలో మట్టా నరేష్ అధ్యక్షతన జరిగిన ఏఐవైఎఫ్ గ్రామ శాఖ సమావేశంలో జమ్ముల జితేందర్ రెడ్డి మాట్లాడుతూ నేటి యువత కుల మత రాజకీయాలనుండి దేశాన్ని కాపాడాలని సమసమాజ స్థాపనే ధ్యేయంగా రాజ్యాంగ బద్దంగా యువత పోరాటాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పావులూరి మల్లిఖార్జున్ , వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పగిళ్లపలి ఏసు, ఏఐవైఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ అధ్యక్షులు అబ్బూరి మహేష్, పార్టీ మండల సహాయ కార్యదర్శి దూసరి గోపాలరావు, రైతు సంఘం మండల కార్యదర్శి పదిమల వెంకటనర్సయ్య, గ్రామ శాఖ కార్యదర్శి షేక్ దస్తగిరి, సహాయ కార్యదర్శులు



మట్టా రవి, కాటిరాల మహేష్, గోగుల ఆది తదితరులు పాల్గొన్నారు. ఏఐవైఎఫ్ నూతన గ్రామ శాఖ అధ్యక్షుడిగా షేక్ నాగుల్ మీరా, కార్యదర్శిగా గోగుల వెంకన్న తో పాటు తొమ్మిది మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

# మెగా జాబ్‌మేళాను సద్వినియోగపరచుకోండి

## ఎమ్మెల్యే రాందాస్ నాయక్



**ప్రజాపక్షం/వైరాః** వైరా మండలం కెజి సిరిపురంలో మచ్చా బుజ్జి పామాయిల్ తోటలో ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ మాట్లాడుతూ ఈ నెల24న శనివారం వైరాలో నిరుద్యోగ యువతి యువకులకు ఉపాధి కల్పించాలని సదుద్దేశ్యంతో మెగా జాబ్‌మేళా ఏర్పాటు చేయడం జరిగింది. జాబ్‌మేళా నిర్వహించడానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్న రాష్ట్ర డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క సారధ్యంలో సింగరేని సంస్థ సహకారంతో వైరా నియోజకవర్గ కేంద్రంలో వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదురుగా ప్రభుత్వ హైస్కూల్ లో మెగా జాబ్‌మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా నిరుద్యోగ యువతీ యువకులు అధిక సంఖ్యలో పాల్గొని ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వైరా నియోజకవర్గంలో తొలిసారిగా మెగా జాబ్‌మేళాను నిర్వహించడం జరుగుతుందని, నియోజకవర్గ ప్రజల అభివృద్ధి కోసం వారియొక్క సంక్షేమం కోసం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క మల్లు నాయకత్వంలో ఎన్నికల్లో హామీల ప్రకారం వివిధ కంపెనీల్లో మంచి జీతంతో కూడిన ఉద్యోగాన్ని కల్పించడానికి వైరా నియోజకవర్గ కేంద్రానికి కొన్ని కంపెనీలను తీసుకొచ్చి ఇక్కడున్న యువత యువకులకు అవకాశలు కల్పించడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని మెగా జాబ్‌మేళాలను నిర్వహించదలిచామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్క నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఐదు మండలాల పార్టీ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, వడ్డే నారాయణరావు, మంగీలాల్‌నాయక్, స్వర్ణ నరేందర్, తలారి చంద్రప్రకాష్, పిసిసి కార్యదర్శి నూతి సత్యనారాయణ, దొడ్డా పుల్లయ్య, మచ్చా బుజ్జి, బోళ్ళ గంగారావు, పమ్మి అశోక్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వేజెండ్ల సాయి, జవ్వాజి నాగరాజు, శీలం చంద్రశేఖర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు గరిడేపల్లి కిషోర్, నిప్పు, సత్యం, తోటకూర గోపి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వానికి అందాల పోటీల నిర్వహణపై ఉన్న శ్రద్ధ ధాన్యం కొనుగోలుపై లేదు

**ప్రజాపక్షం/వైరాః** రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు పైన శ్రద్ధ కనబరచడం లేదని, ఇదే సమయంలో ప్రపంచం సుందరి అందాల పోటీల నిర్వహణ పైన మంత్రులు, అధికారులు శ్రద్ధ కనబరచడం దురదృష్టకరమని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు.ఆదివారం వైరాలో బోడేపూడి వెంకటేశ్వరరావు భవన్‌లో పైడిపల్లి సాంబశివరావు అధ్యక్షతన జరిగిన తెలంగాణ రైతు సంఘం వైరా పట్టణ కమిటీ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కనీస ఏర్పాట్లు చేయలేదని, నెలలు తరబడి రైతులు ధాన్యం అమ్ముకోవడానికి పడిగాపులు కాస్తున్నారని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాసులు పైన రైతులు వడదెబ్బ తగిలి మరణించిన ప్రభుత్వం ధాన్యం కొనుగోలు సకాలంలో తగిలి మరణించిన ప్రభుత్వం ధాన్యం కొనుగోలు సకాలంలో పూర్తి చేయుటకు రాష్ట్ర మంత్రులు శ్రద్ధ కనబరచడం లేదన్నారు. ప్రపంచ సుందరి అందాల పోటీల నిర్వహణ పైన చేస్తున్న ఖర్చు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కనీస వసతులు సమకూర్చేందుకు ఉపయోగించి రైతులు ఇబ్బందులు తొలగించే అవకాశాలు ఉన్నాయని అన్నారు. అకాల వర్షాలతో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఆరబోసిన ధాన్యం తడిసి ఇబ్బందులు



పడుతున్నా మంత్రులు సమీక్ష సమావేశాలు నిర్వహించడం తప్ప కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు పరిష్కారం చేయడం లేదని, మిల్లర్ల దయదాక్షణాలపై ఆధారపడి ధాన్యం కొనుగోలు జరుగుతుందని అన్నారు. రాష్ట్ర సివిల్‌సప్లై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మరో 30 రోజులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉంటాయని సమక్ష సమావేశంలో ప్రకటించాలని అంటే మరో నెల రోజులు ధాన్యం కొనుగోలు కేంద్రాలు రాష్ట్ర మంత్రులు సందర్శించి ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని కోరారు. అకాల వర్షాలతో పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం వైరా పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, గోపవరం సొసైటీ డైరెక్టర్ సంక్రాంతి నర్సయ్య, హరి వెంకటేశ్వరరావు, కృష్ణమూర్తి, శివాజి తదితరులు పాల్గొన్నారు.

# ఏఐవైఎఫ్ జాతీయ సమితి సభ్యులుగా నానబాల రామకృష్ణ



**ప్రజాపక్షం/ఖమ్మం :** అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జాతీయ సమితి సభ్యులుగా ఖమ్మంజిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ ఎన్నికయ్యారు. తిరుపతిలో ఈనెల 15 నుంచి 18 వరకు జరిగిన జాతీయ మహాసభలో ఈ ఎన్నిక జరిగింది. జాతీయ మహాసభలకు ఖమ్మంజిల్లా నుంచి ప్రతినిధులుగా శ్రీనాథ్‌రెడ్డి, ఎం. ఉపేందర్, కొల్లి రవి, గనపారపు ఉపేందర్ హాజరయ్యారు. నానబాల రామకృష్ణ మాట్లాడుతూ దేశ జనాభాలో సగ భాగం కలిగిన యువతను పాలక వర్గాలు విస్మరిస్తున్నాయని ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక యువశక్తి నిర్వీర్యమవుతుందన్నారు. యువజన ఉద్యమాలే సమాజ దిశ దశను మారుస్తాయన్న నేపథ్యంలో బలమైన యువజన ఉద్యమ నిర్మాణం కోసం కృషి చేయనున్నట్లు తెలిపారు.

# సంస్థాగత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపుకు కృషి చేయాలి







**ప్రజాపక్షం/ మధిర ః** త్వరలో జరుగనున్న సంస్థాగత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా కృషి చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ పిలుపునిచ్చారు. తెలంగాణ పిసిసి పిలుపు మేరకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆదేశాల్లో భాగంగా మండలంలోని దెందుకూరు, ఖమ్మంపాడు, చిలుకూరు గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి నూతన గ్రామశాఖ అధ్యక్షులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఎన్నికయ్యే అధ్యక్షులు అందరూ పార్టీని పటిష్ట పరుస్తూ పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు. ప్రజాపాలనలో ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలే పార్టీని గెలిపిస్తాయని, గ్రామస్థాయిలో సంక్షేమ పథకాలపై ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని వివరించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి నిడమానూరి వంశీకృష్ణ, చిలువేరు బుచ్చి రామయ్య, కర్నాటి రామారావు, కోట వెంకటకృష్ణ, మువ్వా వెంకయ్యబాబు, ఊట్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీనుకు నివాళులర్పించిన మాజీ జెడ్‌పిటిసి

## -దహన సంస్కారాలకు రూ.10వేల ఆర్ధికసాయం



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** సోంపల్లి గ్రామ పంచాయితీలో గల బుడ్డగూడెం గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు మీడియం శ్రీను అనారోగ్యంతో మృతి చెందారు. కాగ ఈవిషయం తెలిసి మాజీ జెడ్‌పిటిసి కామిరెడ్డి శ్రీలత, రామకొండారెడ్డి దంపతులు వారి నివాసానికి వెళ్లి పార్థివదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. దహన సంస్కార ఖర్చులకు ఆర్థిక సహాయంగా రూ 10వేలను అందజేశారు. నివాళులర్పించిన వారిలో కైపు ఖగేందర్‌రెడ్డి, బత్తుల రామకొండారెడ్డి, కురుకుంట్ల చిన్నప్పరెడ్డి, మూల బాలిరెడ్డి, గంగుల చంద్రశేఖర్‌రెడ్డి, చేతుల పెద్ద వీర్రాజు, యక్కంటి శ్రీనివాసరావు, కైపు అంకిరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కైపు లక్ష్మి నారాయణరెడ్డి, ధనుగూరి నాగేశ్వరరావు, కనుకు సీతయ్య, బొర్ర భద్రయ్య, మీడియం పుల్లయ్య, సోడే వీరభద్రం, కోర్స రమేష్, కారం శ్రీరాములు, గ్రామ పెద్దలు, నాయకులు, మహిళలు తదితరులు ఉన్నారు.